


స్నేహభావంతో ఉండాలి: జిల్లా న్యాయాధికారి

డెంకాడ, ఆగస్టు 8: తోటి విద్యార్థులతో స్నేహభావంతో మెలగాలని, ర్యాగింగ్‌కు పాల్పడి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని జిల్లా న్యాయాధికారి బి.సాయి కళ్యాణ్ చక్రవర్తి సూచించారు. చింతలవలస ఎంవీజీఆర్ ఇంజనీరింగ్ కాలేజీలో గురువారం జరిగిన న్యాయ అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ర్యాగింగ్‌కు ఎవరైనా పాల్పడితే జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు ఫిర్యాదు చేయవచ్చునని తెలియజేశారు. మాదకద్రవ్యాల జోలికి పోవద్దని, వాటికి బానిసలు కావొద్దన్నారు. వాటిని వాడినా, అమ్మినా, రవాణా చేసినా కఠినమైన శిక్షలు ఉంటాయని తెలిపారు.

ఎవరెవరికో పదవీయోగం

- తెరమీదకు వస్తున్న నామినేటెడ్ పోస్టుల భర్తీ
- కేబినెట్ హోదా పదవులకు డిమాండ్
- పావులు కదుపుతున్న మూడు పార్టీలు
- ఎమ్మెల్యే టిక్కెట్లు దక్కనివారందరి చూపు వీటి పైనే



- టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గొంప కృష్ణ ఎన్ఆర్ఐ కోటాలో శృంగవరపుకోట శాసన సభ టిక్కెట్‌ను ఆశించారు. మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి వైపు పార్టీ మొగ్గు చూపడంతో టిక్కెట్ దక్కలేదు. రెబల్‌గా రంగంలోకి దిగేందుకు నామినేషన్ వేశారు. ఎంత మంది నచ్చజెప్పినా విత్‌డ్రా చేసుకొనేందుకు ససేమిరా అన్నారు. విశాఖ ఎంపి ఎం.శ్రీభరత్ సముదాయించడంతో వెనక్కి తగ్గారు. పార్టీ విజయం కోసం సహకరించారు.
- విజయనగరం పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు కిమిడి నాగార్జున చీపురుపల్లి శాసనసభ నియోజకవర్గ టిక్కెట్ కోసం పట్టుబట్టారు. మాజీ మంత్రి, పార్టీలో సీనియర్ నాయకుడు కిమిడి కళా వెంకటరావుకు టిక్కెట్ ఇవ్వాల్సి రావడంతో ఇతనికి అన్యాయం జరిగింది. ఐదేళ్లగా నియోజకవర్గంలో ఇన్‌చార్జి బాధ్యతలను సమర్థంగా నిర్వహించినా టిక్కెట్ రాకపోవడంతో కలత చెందారు. పార్టీ అధిష్టానం నచ్చజెప్పడంతో ఎమ్మెల్యే గెలుపు కోసం కృషి చేశారు.
- నెల్లిమర్ల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు శాసన సభ టిక్కెట్ దక్కించుకొనేందుకు శత విధాలా ప్రయత్నించారు. పొత్తులో భాగంగా అక్కడ జనసేన పార్టీకి టిక్కెట్ ఇవ్వాల్సి వచ్చింది. దీంతో కనీసం విజయనగరం పార్లమెంటు టిక్కెటైనా దక్కుతుందనుకున్నారు. కానీ ఆ టిక్కెట్ కలిశెట్టి అప్పలనాయుడును వరించింది. అసంతృప్తికి లోనైన ఇతన్ని పార్టీ అధిష్టానం బుజ్జగించడంతో అభ్యర్థుల విజయం కోసం పనిచేశారు.
- గజపతినగరం మాజీ శాసన సభ్యుడు కొండపల్లి అప్పల నాయుడును కాదని ఆయన అన్న కొండలరావు కుమారుడు శ్రీనివాస్‌కు టీడీపీ అధిష్టానం టిక్కెట్ కేటాయించింది. దీంతో మనస్తాపం చెందిన కేఏ నాయుడు ఎన్నికల్లో దూరంగా ఉండేందుకు ప్రయత్నించారు. పార్టీ మారుతున్నారని ప్రచారమూ జరిగింది. ఎన్నికల ప్రచారం కోసం శృంగవరపుకోటకు వచ్చిన అధినేత చంద్రబాబును కలిసిన కేఏ నాయుడు మనసు మార్చుకొని పార్టీ కోసం పని చేశారు.
- తెర్లాం (ఒకప్పటి నియోజకవర్గం) మాజీ ఎమ్మెల్యే తెంటు జయ ప్రకాష్ తనయుడు లక్ష్మనాయుడు బొబ్బిలి శాసన సభ నియోజకవర్గం నుంచి, మాజీ స్పీకర్ కావలి ప్రతిభా భారతి కుమార్తె గ్రీష్మ రాజాం శాసన సభ నియోజకవర్గం నుంచి పార్టీ టిక్కెట్ ఆశించినప్పటికీ దక్కలేదు. పార్టీ అధిష్టానం ఆదేశాలతో బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన, రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీ మోహన్ గెలుపు కోసం ప్రయత్నించారు.

శృంగవరపుకోట, ఆగస్టు 8:

సార్వత్రిక ఎన్నికల సమయంలో టిక్కెట్ ఆశించి రాని వారికి అధికారంలోకి వస్తే సముచిత స్థానం కల్పిస్తామని అధిష్టానం భరోసా ఇచ్చింది. సీఎం నారాచంద్రబాబు నాయుడు ప్రత్యేకంగా మాటిచ్చారరి కొందరంటుంటే, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నుంచి హామీ పొందామని మరికొందరు ప్రచారం చేసుకున్నారు. ఇప్పుడు ఆ సమయం రానే వచ్చింది. నామినేటెడ్ పోస్టుల భర్తీకి తెలుగుదేశం, జనసేన. బీజేపీ కూటమి ప్రభుత్వం సిద్ధపడుతోంది. దీంతో ఎమ్మెల్యే టిక్కెట్‌కు పోటీపడిన వారితో పాటు ఎన్నో ఏళ్లగా పార్టీ కోసం పని చేస్తున్నవారు, ఎన్నికలకు ముందు వైసీపీ నుంచి వచ్చిన వారు నామినేటెడ్ పదవుల కోసం ఎదురు చూస్తున్నారు. కేబినెట్ స్థాయి పదవులు దక్కుతాయని ఎవరికి వారే ఆశల ఊయల్లో ఊగుతున్నారు. మంత్రులు, శాసన సభ్యుల వద్ద మనసులోని కోరికలను బయటపెడుతున్నారు. సార్వత్రిక ఎన్నికల ముందు వరకు వైసీపీ ఎమ్మెల్సీగా కొనసాగిన ఇందుకూరి రఘురాజు వర్గంతో ఆయన సతీమణి సుధారాజు టీడీపీలో కలిసిపోయారు. ఆ సమయంలో పార్టీ అధికారంలోకి వస్తే తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు సభ్యురాలిగా అవకాశం కల్పిస్తామని అప్పట్లో యువనేత మాటిచ్చారని వీరి వర్గీయులు చెప్పుకుంటూ వచ్చారు. ఇలా ప్రతి నియోజకవర్గంలోనూ టీడీపీతో పాటు జనసేన నుంచి కూడా ఆశావాహుల సంఖ్య తక్కువేమీలేదు. మాజీ మంత్రి పడాల అరుణ, శృంగవరపుకోట నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి ఒబ్బిన సత్యనారాయణ వంటి వారు ఉన్నారు. వీరేకాక మంత్రి పదవులు దక్కని సీనియర్‌లు కేబినేట్ హోదా కలిగిన కీలక నామినేటెడ్ పదవుల కోసం పట్టుపడుతున్నట్లు తెలుస్తోంది. నామినేటెడ్ పదవుల్లో తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్‌తో పాటు ఏపీఎస్ఆర్‌టీసీ, ఏపీఎండీసీ, ఏపీఐఐసీ, పీసీబి, ఏపీడీసీ, గిరిజన కార్పొరేషన్ చైర్మన్ వంటి కీలక నామినేటెడ్ పదవులకు డిమాండ్ ఎక్కువ వుంది. ఈ పదవుల కోసం జనసేన పార్టీ పట్టుబడుతోంది. ఈ పదవులు జిల్లాలోని ఏ పార్టీ వారు దక్కించుకుంటారోనన్న చర్చ జరుగుతోంది.

జిల్లా స్థాయిలోను కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్ పదవి కీలకమైనదే. రాష్ట్ర స్థాయిలో నామినేటెడ్ పదవి దక్కని సమయంలో దీనిని అయినా దక్కించుకోవాలన్న ప్రయత్నంలో కొంత మంది ఉన్నారు. జిల్లాలో ప్రముఖ దేవాలయాలకు చైర్మన్‌లు, డైరెక్టర్లు, మార్కెట్ కమిటీ చైర్మన్‌లు వంటి పదవులు ఉన్నాయి. వీటిని దిగువ శ్రేణి నేతలు పొందేందుకు పావులు కదుపుతున్నారు. వీటికి శాసన సభ్యుల సిఫార్సులు కీలకం కావడంతో వారి చుట్టూ ప్రదక్షణ చేస్తున్నారు. 'గెలుపుకోసం ఎంతో కష్టపడ్డాను.. గుర్తింపుకోసం నామినేటెడ్ పదవి అయినా ఇవ్వండి' అంటూ డిమాండ్ చేస్తున్నారు.

గతం ప్రభుత్వంలో అంతా భిన్నం..

వైసీపీ ప్రభుత్వం సామాజిక సమీకరణాలతో పని లేకుండా నామినేటెడ్ పదవులను అప్పగించింది. అప్పటి సీఎం జగన్, విజయసాయి రెడ్డి, వైవీ సుబ్బారెడ్డిలు తమకు నచ్చినవారందరికీ ఈ పదవులను కట్టబెట్టారు. శాసన సభ్యుల మాటకు విలువ వుండేది కాదు. రెడ్డి సామాజిక వర్గానికి చెందిన కాయల వెంకట రెడ్డికి ప్రాధాన్యత కలిగిన రాష్ట్ర మారిటం బోర్డు చైర్మన్‌ను చేశారు. జిల్లాలో ఇందుకు అర్హత కలిగిన ప్రధాన సామాజిక వర్గాలకు చెందిన నేతలున్నా రాష్ట్ర స్థాయి పదవి వారికి దక్కలేదు. శృంగవరపుకోట నియోజకవర్గంలో రాష్ట్ర కొప్పల వెలమ కార్పొరేషన్ చైర్మన్, జిల్లా సహకార బ్యాంకు చైర్మన్ పదవులను ఒకే సామాజిక వర్గానికి కట్టబెట్టారు. ప్రభుత్వ పరంగా ఎన్నికైన పదవులతో పాటు పార్టీ పదవులు పంపకంలోను ఇంతే. ఉదాహరణకు వేపాడ ఎంపీపీ, పార్టీ ఇన్‌చార్జి, నామినేటెడ్ పోస్టుల డైరెక్టర్‌లలో ఒకే సామాజిక వర్గానికి ప్రాధాన్యం ఇవ్వడంతో ఈ సామాజికవర్గంతో సమానంగా వున్న మరో సామాజిక వర్గం అంతర్గతంగా రగిలిపోయింది. అప్పట్లో మంత్రి బొత్స సత్యనారాయణ, జడ్పీచైర్మన్, పార్టీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు (చిన్నశ్రీను)ల వద్దకు వెళ్లిన ప్రతిసారి ఈ సామాజిక వర్గ నేతలు దెప్పిపొడిచేవారు. సార్వత్రిక ఎన్నికల్లోనూ వైసీపీకి ఆ సామాజిక వర్గం సహకారం కరువైంది. ఇలాంటి పరిస్థితులు తలెత్తకుండా టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం సామాజిక సమీకరణాల కూర్పులో పొత్తుల ధర్మాన్ని పాటించేలా పదవుల పంపకం ఉంటుందని కూటమి నేతలు చెబుతున్నారు.

మాజీ ఎంపీ కెంబూరి కన్నుమూత

- నివాళులర్పించిన మంత్రి శ్రీనివాస్

చీపురుపల్లి, ఆగస్టు 8: ఒకప్పటి బొబ్బిలి పార్లమెంట్ మాజీ సభ్యుడు, చీపురుపల్లి మాజీ ఎమ్మెల్యే కెంబూరి రామ్మోహనరావు గురువారం తెల్లవారుజామున కన్ను మూశారు. ఆయన వయసు 75 సంవత్సరాలు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో ఉన్న ఆయన విశాఖపట్నంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున తుది శ్వాస విడిచారు. ఆయనకు భార్య రుష్యేంద్రమణి, కుమార్తెలు మైథిలి, సౌజన్య ఉన్నారు. నిబద్ధత, నీతి నిజాయితీ గల నాయకునిగా ఆయన రాజకీయాల్లో తనదైన ముద్ర వేసుకున్నారు. ఉమ్మడి జిల్లాలో ఆయన గతంలో బొబ్బిలి ఎంపీగా, చీపురుపల్లి ఎమ్మెల్యేగా పనిచేశారు. శ్రీకాకుళం జిల్లా రేగిడి మండలంలోని పుర్లె గ్రామంలో 1949 అక్టోబరు 12న జన్మించారు. తండ్రి ఉద్యోగ రీత్యా ఆయన కుటుంబంతో చీపురుపల్లి వచ్చి స్థిర పడ్డారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం అనంతరం ఆ పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితుడై ఎన్‌టీ రామారావు సమక్షంలో పార్టీలో చేరారు. 1985లో చీపురుపల్లి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి తెలుగుదేశం పార్టీ తరఫున పోటీ చేసి గెలుపొందారు. 1989 నుంచి 1991 వరకూ 9వ లోక్‌సభ సభ్యునిగా ఉన్నారు. 1994లో కాంగ్రెస్ పార్టీలో చేరి చీపురుపల్లి అసెంబ్లీకి పోటీ చేసి ఓటమి పాలయ్యారు.



కెంబూరి భౌతిక కాయం వద్ద మంత్రి శ్రీనివాస్, మాజీ మంత్రి మృణాళిని తదితరులు

పలువురి ప్రముఖుల పరామర్శ

కెంబూరి రామ్మోహనరావు మృతి పట్ల రాష్ట్ర ఎన్ఆర్ఐ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తన సంతాపాన్ని వ్యక్తం చేశారు. గురువారం ఉదయం చీపురుపల్లి చేరుకున్న మంత్రి చీపురుపల్లిలోని కెంబూరి భౌతిక కాయం వద్ద నివాళులర్పించారు. కుటుంబాన్ని పరామర్శించారు. మాజీ మంత్రి, కెంబూరి సోదరి కిమిడి మృణాళిని, ఆమె తనయుడు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు కుచ్చర్లపాటి త్రిమూర్తులరాజు, పలువురు వైసీపీ నాయకులు కెంబూరి భౌతికకాయం వద్ద నివాళులర్పించారు.



రెజ్లర్ వినేశ్ ఫొగట్‌కు మద్దతుగా..

పారిస్ ఒలింపిక్స్‌లో రెజ్లింగ్ విభాగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఫైనల్‌కు చేరిన భారత రెజ్లర్ వినేశ్ ఫొగట్‌పై బరువు నెపంతో ఒలింపిక్ కమిటీ అనర్హత వేటు వేయడాన్ని నిరశిస్తూ విజయనగరంలో విద్యార్థులు గురువారం ర్యాలీ చేశారు. ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి మయూరి జంక్షన్ వరకూ వెళ్లాక అక్కడ మానవహారంగా ఏర్పడ్డారు. కేవలం 100 గ్రాముల బరువును సాకుగా చూపి పోటీనుంచి తప్పించటాన్ని ఖండిస్తూ నినాదాలు చేశారు. వినేష్‌ఫొగట్‌కు న్యాయం జరిగేంత వరకు దేశ ప్రజలంతా ఏకం కావాల్సిన ఆవశ్యకత ఉందన్నారు.

- విజయనగరం (ఆంధ్రజ్యోతి)

బెల్టు షాపులపై దాడులు చేయండి

ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైం, ఆగస్టు 8: గ్రామస్థాయి నుంచి పట్టణ స్థాయి వరకూ బెల్టుషాపులపై విస్తృతంగా దాడులు నిర్వహించి, కేసులు నమోదు చేయాలని ఎస్పీ వకుల్ జిందాల్ అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయ సమావేశ మందిరంలో స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంటు బ్యూరో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇసుక అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, కేసులు నమోదు చేసి వాహనాలు సీజ్ చేయాలన్నారు. గ్రామస్థాయిలో గంజాయి, సారా, ఇతర మత్తుపదార్థాల నియంత్రణకు కఠిన చర్యలు చేపట్టాలని, తయారీ, రవాణా అమ్మకాలపై నిఘా పెట్టాలని సూచించారు. సారా తయారీ, అమ్మకాలకు అలవాటు పడిన వారిని జిల్లా వ్యాప్తంగా గుర్తించి, వారిపై బైండోవర్ కేసులు నమోదు చేయాలన్నారు. గంజాయి, సారా రవాణాలో అరెస్టయిన నిందితులను విచారించి.. రవాణా మూలాలను గుర్తించి, బాధ్యులైన వారిని కూడా కేసుల్లో విచారించాలన్నారు. సమావేశంలో ఏఎస్పీ ఆస్మాపరహీన్ పాల్గొన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న ఎస్పీ వకుల్‌జిందాల్

ప్రతిష్టాత్మకంగానే..

- సాధారణ ఎన్నికలు తలపించిన స్కూల్ కమిటీల ఎంపిక
- కొన్నిచోట్ల సర్దుబాటు చేసుకున్న కూటమి, వైసీపీ నాయకులు
- కూటమి ఖాతాలోకే ఎక్కువ కమిటీలు

విజయనగరం (ఆంధ్రజ్యోతి)/ కలెక్టరేట్, ఆగస్టు 8:

పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీల ఎంపిక (ఎస్ఎంసీ) ప్రక్రియ జిల్లాలో సాధారణ ఎన్నికలను తలపించింది. వివిధ పార్టీలకు చెందిన స్థానిక నాయకులు పరోక్ష పాత్ర పోషించడంతో ఎంపిక ఉత్కంఠగా సాగింది. జనరల్ ఎన్నికల మాదిరి వాతావరణం కనిపించింది. కొన్ని చోట్ల ఇరు పార్టీలు సర్దుబాటు ధోరణికి వచ్చారు. చైర్మన్ పదవి ఒక పార్టీకి, వైస్ చైర్మన్ పదవి మరో పార్టీకి పంపకాలు చేసుకున్నారు. కోరం లేనిచోట చిన్న చిన్న గొడవలు జరిగాయి. అత్యధికంగా కూటమి నాయకుల అనుచరులే పాఠశాల కమిటీలను దక్కించుకున్నారు. చాలా చోట్ల ఏకగ్రీవం కావడం విశేషం. గతంలో వైసీపీ అనుచరులు ఉన్న స్కూల్స్‌లో ఇప్పుడు కూటమి అనుచరులు చైర్మన్లు అయ్యారు. మొదటి నుంచి కూటమి వర్గీయులు పక్కా వ్యూహంతో కార్యాచరణ తయారు చేసుకుని పాఠశాల కమిటీల ఎంపికపై ప్రత్యేక దృష్టి పెట్టారు. పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. మన అనుచరులు గెలిస్తే వచ్చే ఉపయోగం గురించి క్షేత్ర స్థాయిలో వివరించారు. వారి ఆలోచన తగ్గినట్టుగానే కమిటీ సభ్యులు చాలా వరకు చైర్మన్లను దక్కించుకున్నారు. వైసీపీ నాయకులు అవకాశం ఉన్న చోట పోటీకి దిగారు. అయినా మెజార్టీ స్థానాలు కూటమి నాయకులే దక్కించుకున్నారు.

జిల్లా వ్యాప్తంగా గురువారం 1,799 స్కూల్స్‌కి ఎస్ఎంసీ ఎన్నికలు నిర్వహించగా 1,751 స్కూల్స్‌లో ఎన్నికలు పూర్తయ్యాయి. కోరం లేక 48 స్కూల్ కమిటీలు ఎంపిక జరగలేదు. మెంటాడ మండలంలో ఒక స్కూల్‌లో మద్యం బాటిళ్లు పంచేందుకు సిద్ధమవ్వగా పోలీసులు ప్రవేశించి 87 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. వంగర మండలం శివ్వాంలో నువ్వా? నేనా అన్నంతగా స్కూల్ కమిటీ ఎన్నికలు జరిగాయి. రేగిడి మండలం సోమరాజుపేటలో ఇరువర్గాల మధ్య స్వల్ప వివాదం చోటు చేసుకుంది. గుర్ల మండలం పాలవలస, పెదబంటుపల్లి తదితర ప్రాంతాల్లో వివాదాలు చోటు చేసుకున్నాయి. విజయనగరంలోని కస్పా మున్సిపల్ హైస్కూల్‌లో ఎన్నికలు హోరాహోరీగా సాగాయి. గంట్యాడ మండలంలోని మాజీ ఎంపీపీ కొండపల్లి కొండలరావు ఆధ్వర్యంలో టీడీపీ మండల నాయకులు కమిటీల ఎంపికను ప్రతిష్టాత్మకంగా తీసుకుని సూచనలు ఇచ్చారు. విజయనగరం పట్టణంలో టీడీపీ నాయకులు విజ్జపు ప్రసాద్‌తో పాటు చుట్టు పక్కల ప్రాంతాలకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఎన్నికల క్రతువును పర్యవేక్షించారు.



బొబ్బిలి: జగన్నాథపురం పాఠశాలలో ఎన్నికల దృశ్యం

ఆ ఐదేళ్లూ దుర్భరం



- గిరిజనుల దరిచేరని సంక్షేమ పథకాలు, రుణాలు
- సబ్‌ప్లాన్ నిధులను దారి మళ్లించిన వైసీపీ సర్కారు
- కూటమి ప్రభుత్వం వచ్చాక చిగురిస్తున్న ఆశలు
- నేడు అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం

వారు అమాయక అడవితల్లి బిడ్డలు. అటవీ ఉత్పత్తులే ప్రధాన జీవనాధారం. వాటిని సంతలకు తరలిస్తూ వచ్చిన ఆదాయంతో బతుకుతుంటారు. ఇలా తరాలు మారుతున్నా వారి సమస్యలు పరిష్కారం కావడం లేదు. ప్రధానంగా డోలీలో ప్రయాణం... గిరి శిఖర గ్రామాలకు రహదారి లేకపోవడం.. ప్రాథమిక వైద్యం అందకపోవడం.. ఇతర మౌలిక సదుపాయాలకు నోచుకోక పోవడం ఏళ్లుగా చూస్తున్నాం. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో మరింత దుర్భర జీవితాన్ని నెట్టుకొచ్చారు. కనీసం రహదారులు నిర్మించే ప్రయత్నం చేయలేదు. పైగా వారి అభివృద్ధి కోసం కేటాయించిన సబ్‌ప్లాన్ నిధులను కూడా దారి మళ్లించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక గిరిజనుల్లో ఆశలు చిగురించాయి. శుక్రవారం అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా గిరిజనుల జీవన విధానం.. దుర్భర దుస్థితిని తెలుసుకుందాం.

(శృంగవరపుకోట)

గిరిజన ప్రాంతాలు కనీస అభివృద్ధికి నోచుకోవడం లేదు. టీడీపీ ప్రభుత్వ హయాంలో సబ్‌ప్లాన్ నిధులు కేటాయించి గిరిజనుల ఆర్థికాభివృద్ధికి వాటిని వినియోగించేవారు. వైసీపీ ప్రభుత్వం సబ్‌ప్లాన్ నిధులను దారి మళ్లించడంతో గత ఐదేళ్లలో గిరిజనుల ఆర్థికాభివృద్ధి మరింత కుంటుపడింది. వారి గ్రామాలకు రహదారి సౌకర్యాలు లేక వైద్యసేవలు సక్రమంగా అందడం లేదు. కొండలపై ఉన్న గిరిజన గ్రామాల వారు ఊట నీరే తాగుతున్నారు. సోలార్ తాగునీటి పథకాలు పాడైనా మరమ్మతులు చేపట్టడం లేదు. ఎస్.కోట మండలం దారపర్తి, మూల బొడ్డవర పంచాయితీ పరిధిలోని పలు గ్రామాలకు రోడ్ల సదుపాయాలు లేవు. గంట్యాడ మండలం డీకె పర్తి గ్రామ పంచాయతీ పరిధిలోని అనేక గ్రామాలకు రోడ్లు కనిపించవు. వీరికి ఏ అవసరమైనా నదులు, గెడ్డలు, కొండలు, గుట్టలు దాటుకొని కాలినడకన రావాల్సిందే. అస్వస్థతకు గురైన గిరిజనులను కిందకు దించేందుకు డోలీ మోతొక్కటే మార్గం.

కూటమి ప్రభుత్వంపై ఆశలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో గిరిజనుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఇటీవల సీఎం చంద్రబాబు.. గిరిజనశాఖకు సంబంధించి సమీక్ష నిర్వహించారు. గిరిజన గ్రామాలకు రహదారుల సౌకర్యం, గర్భిణులకు వసతిగృహాలు, ఫీడర్ అంబులెన్స్‌లు, సబ్‌ప్లాన్, ట్రైకార్ రుణాలు మంజూరు చేయాలని సూచించారు. జీసీసీ ద్వారా అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించేలా చర్యలు తీసుకుంటామని గిరిజనశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి హామీ ఇచ్చారు.



- తన ముగ్గురు పిల్లలతో పాటు బంధువుల చిన్నారితో కలిసి వున్న ఈ యువతి పేరు బడ్నాయన అచ్చమ్మ. వీరికి పోడు వ్యవసాయమే జీవనాధరం. ఎకరా పొలంలో పండిన పంట, అటవీ ప్రాంతంలో సేకరించిన చింతపండు వంటి ఉత్పత్తులను విక్రయించాలంటే శృంగవరపుకోట మండలం దారపర్తి పంచాయతీ శివారు గిరిజన గ్రామం గునపాడు-1 నుంచి 8 కిలోమీటర్ల దూరంలో వున్న ఇదే మండలం బొడ్డవర రైల్వే స్టేషన్‌కు కాలినడకన రావాల్సిందే. వీరిలో ఎవ్వరికైనా సుస్తీ చేస్తే డోలీ కట్టాల్సిందే. ఇలాంటి చోట విద్య, వైద్యం, పౌష్టికాహారం ఎంతవరకు అందుతాయో వీరిని చూసి అర్థం చేసుకోవచ్చు.

ఐటీడీఏలో చేరిస్తేనే కష్టాలు తీరేది

ఐటీడీఏలో చేరినప్పుడే నాన్ షెడ్యూల్ నుంచి షెడ్యూల్ పరిధిలోకి వెళతాం. అప్పుడే గిరిజనుల కష్టాలు తొలుగుతాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ఐటీడీఏ పరిధిలో వున్న అనంతగిరి మండలానికి ఆనుకుని ఎస్.కోట, గంట్యాడ, వేపాడ గిరిజన గ్రామాలున్నాయి. వీటన్నింటినీ ఈ ఐటీడీఏలో చేర్చితే మంచిది. మిగిలిన గిరిజన గ్రామాలను పార్వతీపురం ఐటీడీఏలో చేర్చాలి.

- జె.గౌరిష్, ఆదివాసీ గిరిజన సంఘ నాయకుడు

ఆంధ్రజ్యోతి
నవ్య | చిత్రజ్యోతి
శ్రీకాకుళం • శుక్రవారం • 9 ఆగస్టు 2024
cinema@andhrajyothy.com

ఒకప్పుడు అడవులను రక్షించే పాత్రల్లో హీరోలు ఇప్పుడు అటవీ సంపద దోచుకోవడమే హీరోయిజం



- పవన్ కల్యాణ్ వ్యాఖ్యలు
- అల్లు అర్జున్‌ను ఉద్దేశించేనా?

ఒకప్పుడు అడవులను రక్షించే కథాంశాలతో వచ్చిన సినిమాలలో హీరోలు నటించేవారని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. ఇందుకు ఉదాహరణగా కన్నడ సినిమా 'గంధదగుడి' చిత్రాన్ని ఆయన ప్రస్తావించారు. కానీ ఈనాడు అటవీ సంపదను దోచుకోవడమే హీరోయిజంగా సినిమాలు వస్తున్నాయని ఆయన విచారం వ్యక్తంచేశారు. రీల్‌కు, రియాలిటీకి తేడా ఉంటుందన్నారు. పుష్ప సినిమాలో అడవుల్లోని ఎర్రచందనం కొల్లగొట్టే పాత్రలో హీరో అల్లు అర్జున్ నటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయనను ఉద్దేశించే పవన్‌కల్యాణ్ ఈ వ్యాఖ్యలు చేశారా అంటూ ఈ అంశం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

మానవత్వం చూపాల్సిన తరుణం ఇది

ఇటీవల కురిసిన భారీ వర్షాలు కేరళలోని వయనాడ్‌లో విషాదాన్ని మిగిల్చాయి. కొండ చరియలు విరిగి పడడంతో వందలాది మంది ప్రాణాలు కోల్పోయారు. బాధితులను ఆదుకోవడానికి సినీ ప్రముఖులు ముందుకు వచ్చారు. కేరళ సీఎం రిలీఫ్ ఫండ్‌కు మెగాస్టార్ చిరంజీవి, ఆయన తనయుడు రామ్ చరణ్ కోటి రూపాయల విరాళం ప్రకటించిన సంగతి తెలిసిందే. గురువారం కేరళ వెళ్లి నేరుగా ముఖ్యమంత్రి పినరయి విజయన్‌ను కలసి విరాళం చెక్కును అందజేశారు చిరంజీవి. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ 'మానవత్వం చూపాల్సిన తరుణం ఇది. ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి తమ వంతుగా కేరళకు సాయం అందించాలి. ఈ దుర్ఘటనను కేంద్ర ప్రభుత్వం జాతీయ విపత్తుగా ప్రకటించాలి' అని కోరారు.





నాగచైతన్య శోభిత నిశ్చితార్థం

టాలీవుడ్ కథానాయకుడు అక్కినేని నాగచైతన్య తన అభిమానులకు సర్‌ప్రైజ్ ఇచ్చారు. కొన్నాళ్లుగా వినిపిస్తున్న ఊహాగానాలను నిజం చేస్తూ కథానాయిక శోభితా దూళిపాళ్లతో ఆయన ఏడడుగులు వేయనున్నారు. వీరిద్దరి నిశ్చితార్థం గురువారం ఉదయం హైదరాబాద్‌లోని నాగార్జున నివాసంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఇరువైపులా కుటుంబ సభ్యులు, కొద్దిమంది సన్నిహితులు హాజరయ్యారు. నిశ్చితార్థం ఫొటోలను నాగార్జున సోషల్ మీడియాలో షేర్ చేసి, కాబోయే దంపతులను ఆశీర్వదించాలని కోరారు. 'ఈ రోజు ఉదయం మా అబ్బాయి నాగచైతన్య, శోభిత దూళిపాళ్ల నిశ్చితార్థం జరిగింది. ఈ మధుర క్షణాలను మీతో పంచుకుంటున్నందుకు ఆనందంగా ఉంది. చాలా సంతోషంగా శోభితను మా కుటుంబంలోకి ఆహ్వానిస్తున్నాం. మీ ఇద్దరూ ప్రేమ, సంతోషంతో కలకాలం జీవించాలని కోరుకుంటున్నాను' అని నాగార్జున పేర్కొన్నారు. నిశ్చితార్థ వేడుకలో శోభిత ఉప్పాడ పట్టు చీర ధరించగా, నాగచైతన్య పంచెకట్టు, పైన కండువా ధరించి సంప్రదాయ వస్త్రధారణతో కనువిందు చేశారు. పలువురు సినీ ప్రముఖులు నాగచైతన్య, శోభితకు అభినందనలు తెలిపారు. మరికొద్ది రోజుల్లో వీరి వివాహం జరగనుంది. సమంతతో విడాకులు తీసుకున్నాక నాగచైతన్య శోభితతో ప్రేమలో పడ్డారనీ, ఇద్దరూ తరచూ కలుసుకుంటున్నారని వార్తలు వచ్చాయి. పలు సందర్భాల్లో నాగచైతన్య, శోభితా జంటగా కనిపించిన ఫొటోలు వైరల్ అయ్యాయి. కానీ నిశ్చితార్థం వరకూ వారు ఎక్కడా దీనిపై స్పందించలేదు. నాగచైతన్య, శోభిత కలసి ఒక్క సినిమా కూడా చేయలేదు. స్నేహితుల ద్వారా ఇద్దరికీ పరిచయం అయ్యి అది ప్రేమగా మారిందని సమాచారం. చూసేందుకు ఇంటర్నేషనల్ మోడల్‌లా కనిపించే శోభిత తెలుగమ్మాయే. తెనాలిలో జన్మించారు. కొన్నాళ్లు కుటుంబంతో విశాఖలో ఉన్నారు. ముంబైలో ఉన్నత విద్యను అభ్యసించారు. మోడల్‌గా కెరీర్ మొదలుపెట్టారు. 2013 ఫెమీనా మిస్ ఇండియా ఎర్త్ టైటిల్ గెలుచుకున్నారు. 2016లో వచ్చిన బాలీవుడ్ చిత్రం 'రామన్ రాఘవన్'తో సినిమాల్లోకి ఎంట్రీ ఇచ్చారు. తెలుగులో 'గూఢచారి, మేజర్' చిత్రాల్లో నటించారు.

నాడు ప్రేమ ప్రకటన

'ఏ మాయ చేశావే' చిత్రంలో జంటగా నటించిన నాగచైతన్య, సమంత ఏడేళ్ల డేటింగ్ తర్వాత 2017లో వివాహ బంధంలోకి అడుగుపెట్టారు. 2021లో పరస్పర అంగీకారంతో విడిపోతున్నట్లు ప్రకటించారు. ఆగస్టు 8న నాగచైతన్యకు తన ప్రేమ ప్రతిపాదన చేశానని సమంత ఓ సందర్భంలో చెప్పారనీ, ఇప్పుడు అదే తేదీన నాగచైతన్య శోభితల నిశ్చితార్థం జరగడం కాకతాళీయమేనా, కావాలనే అలా చేశారా? అనే చర్చ సోషల్ మీడియాలో జరుగుతోంది. ప్రస్తుతం నాగచైతన్య 'తండేల్' చిత్రంలో నటిస్తున్నారు. శోభిత హిందీలో 'సితార' చిత్రం చేస్తున్నారు.



ముందస్తు బెయిల్

నటుడు రాజ్‌తరుణ్‌కు హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. రాజ్‌తరుణ్ తనను ప్రేమించి మోసం చేశాడంటూ లావణ్య అనే మహిళ ఫిర్యాదుపై అతనిపై నార్సింగ్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైన సంగతి తెలిసిందే. రాజ్‌తరుణ్ రెండు వారాల్లో నార్సింగ్ ఎస్‌హెచ్‌వో ఎదుట హాజరుకావాలని, రూ.20 వేల బాండు, రెండు పూచీకత్తులు ఇవ్వాలని జస్టిస్ శ్రీదేవి ధర్మాసనం ఆదేశించింది. 8 వారాల పాటు ప్రతి శనివారం పిటిషనర్ పోలీసుల ఎదుట హాజరుకావాలని షరతు విధించింది. మరోవైపు రాజ్‌తరుణ్ స్నేహితుడు శేఖర్ బాషాతో తనకు ప్రాణహాని ఉందని లావణ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సెట్స్‌లోకి...



పవన్‌కల్యాణ్ నటిస్తున్న పీరియాడికల్ యాక్షన్ చిత్రం 'హరి హర వీరమల్లు'. జ్యోతికృష్ణ దర్శకత్వంలో ఏ.ఎమ్.రత్నం నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఆఖరి దశ షూటింగ్‌లో ఉన్న ఈ సినిమా సెట్స్‌లోకి బాలీవుడ్ నటుడు అనుపమ్ ఖేర్ అడుగుపెట్టారు. ఈ సందర్భంగా ఆయనను ఆహ్వానిస్తూ చిత్ర బృందం ఓ పోస్టర్‌ను విడుదల చేసింది. "పవన్, అనుపమ్ ఖేర్ కలయికలో వచ్చే సన్నివేశాలు సినిమాకే హైలైట్‌గా ఉండనున్నాయి. అభిమానులకి జీవితాంతం గుర్తుండిపోయే సినిమా ఇది" అని మేకర్స్ సోషల్ మీడియాలో పేర్కొన్నారు.

షెకావత్ సాబ్



అల్లు అర్జున్ హీరోగా నటిస్తున్న 'పుష్ప 2' చిత్రం షూటింగ్ శరవేగంతో జరుగుతోంది. ప్రస్తుతం రామోజీ ఫిల్మ్ సిటీలో వేసిన భారీ సెట్‌లో హీరోతో పాటు కీలక పాత్రలు పోషిస్తున్న ఆర్టిస్టులు పాల్గొనగా పతాక సన్నివేశాలు తీస్తున్నారు. బన్వర్‌సింగ్ షెకావత్‌గా నటిస్తున్న పహాద్ ఫాజిల్ లుక్ పోస్టర్‌ను ఆయన పుట్టిన రోజు సందర్భంగా గురువారం విడుదల చేశారు. గళ్ల లుంగీ, ఒక చేతిలో గన్, మరో చేతిలో గొడ్డలితో పహాద్ కనిపిస్తున్నారు. డిసెంబర్ 6న 'పుష్ప 2' చిత్రం ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది. సుకుమార్ దర్శకత్వంలో నవీన్ యర్నేని, రవిశంకర్ యలమంచి నిర్మిస్తున్నారు.

నిర్మాతగా సంతృప్తినిచ్చింది



'కమిటీ కుర్రోళ్లు' సినిమాతో నిహారిక కొణిదెల నిర్మాతగా మారారు. యదు వంశీ దర్శకత్వం వహించారు. ఈ శుక్రవారం సినిమా విడుదలవుతున్న సందర్భంగా నిహారిక మీడియాతో ముచ్చటించారు. "కథ విన్న వెంటనే ఈ సినిమాలో భాగం అవ్వాలనుకున్నాను. ఒక ఊరిలో జాతర నేపథ్యంలో మూడు తరాలకు చెందిన కథగా దర్శకుడు తెరకెక్కించారు. అందరికీ సినిమా విపరీతంగా నచ్చుతుంది. ఇందులో ఎన్నో క్యారెక్టర్లు ఉన్నా.. ప్రతీ పాత్రకూ విలువ ఉంటుంది. ప్రేక్షకులు ఏదో ఒక పాత్రతో కచ్చితంగా ట్రావెల్ అవుతారు. ఒక నిర్మాతగా ఈ సినిమా నాకెంతో సంతృప్తినిచ్చింది" అని చెప్పారు.

పేదలంటే జగన్‌కు చిన్న చూపు

● రాజాం ఎమ్మెల్యే కోండ్రు

రాజాం: వైసీపీ అధినేత జగన్‌కు పేదలంటే చిన్న చూపు అని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ అన్నారు. గురువారం రాజాం బస్టాండ్‌లో అన్న క్యాంటీన్ నిర్మాణ పనులను పరిశీలించారు. త్వరితగతిన పూర్తి చేయాలని మున్సిపాలిటీ అధికారులను ఆదేశించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అన్న క్యాంటీన్‌లను ఎత్తివేసిందని విమర్శించారు. అన్న క్యాంటీన్‌ను ఇక్కడ సెప్టెంబరు నెలలో ప్రారంభిస్తామని కోండ్రు తెలిపారు. ఈ భవనానికి ప్రభుత్వం రూ 20.5 లక్షలు మంజూరు చేసిందన్నారు. అనంతరం రాజాం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో మూతపడిన షాపులను, మెయిన్ రోడ్డులో చెత్తకుప్పలతో ఉన్న పాత ఆర్ అండ్‌బీ స్థలాన్ని పరిశీ లించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు నంది సూర్యప్రకాష్ రావు, వంగా వెంకటరావు, శాసపు రాజేష్‌కుమార్, టంకాల నాగరాజు, ఉరిటి సురేంద్ర, పొన్నాడ భీమేశ్వరరావు, గురవాన నారా యణరావు, కమిషనర్ జె.రామప్పలనాయుడు, ఏఈ భాగ్యలక్ష్మి, శాసపు రమేష్ కుమార్, టంకాల కన్నంనాయుడు, అభిమానులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



అన్న క్యాంటిన్ పనులు పరిశీలిస్తున్న కోండ్రు

గంజాయి సోర్స్‌పర్సన్ కోసం గాలిస్తున్నాం

● పార్వతీపురం ఏఎస్పీ సునీల్ శిరోన్ ● వాహనంలో తలిస్తున్న 87 కిలోల గంజాయి స్వాధీనం.. నిందితుడి అరెస్టు

సాలూరు రూరల్, ఆగస్టు 8: బాగువలస వద్ద గంజాయి తరలిస్తూ నిందితుడు బుధవారం పట్టుపడిన విషయం తెలిసిందే. ఈ గంజాయి తరలింపులో సోర్స్‌పర్సన్ కోసం పోలీసు బృందాలను ఏర్పాటు చేసి గాలిస్తున్నట్టు పార్వతీపురం ఏఎస్పీ సునీల్ శిరోన్ తెలిపారు. సాలూరు రూరల్ పోలీసులు పట్టుకున్న గంజాయితో పాటు నిందితుడు బలేస్వర్ సింగ్‌ను గురువారం ఆయన సమక్షంలో పోలీసులు మీడియా ఎదుట ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఒడిశా నుంచి బీహార్‌కు బొలెరో వాహనంలో తరలిస్తున్న వాహనాన్ని సాలూరు రూరల్ ఎస్.ఐ వెంకటరమణ, సిబ్బంది పట్టుకున్నారన్నారు. వాహనాన్ని నడుపుతున్న నిందితుడు బలేస్వర్ సింగ్ పశ్చిమ బెంగాల్ రాష్ట్రం హుబ్లీ ప్రాంత పరిధిలో నౌహూర్‌కు చెందిన వ్యక్తి అని తెలిపారు. ఆయనపై పశ్చిమ బెంగాల్‌లో ఎన్‌డీపీఎస్ కేసు ఉండడంతో నిందితుడు జైలు శిక్ష అనుభవించి బయటకు వచ్చాడన్నారు. ఒడిశా నుంచి పాచిపెంట మీదుగా వచ్చి సాలూరు మీదుగా వెళ్తున్న సమయంలో సాలూరు రూరల్ ఎస్.ఐ, సిబ్బంది గంజాయి రవాణా చేస్తున్న వాహనాన్ని, నిందితుడిని పట్టుకున్నారన్నారు. వాహనం టాప్‌పై పుష్ప సినిమా తరహాలో పెట్టిన 41 ప్యాకెట్లలో 87 కిలోల 290 గ్రాముల గంజాయి పట్టుబడిందన్నారు. నిందితుని వద్ద నుంచి సెల్‌ఫోన్, 13 వేల రూపాయలను స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. గంజాయి రవాణాకు మూలకారకుడైన వ్యక్తి కోసం బృందాలు గాలిస్తున్నాయన్నారు. గంజాయిని పట్టుకున్న పోలీసులను ఆయన అభినందించారు. ఆయనతో సాలూరు రూరల్ సీఐ బాలకృష్ణ, ఎస్.ఐ వెంకటరమణ ఉన్నారు.



మాట్లాడుతున్న ఏఎస్పీ సునీల్



వాహనం టాప్‌పై అమర్చిన గంజాయి ప్యాకెట్లు

జిల్లాలో మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి

విజయనగరం (ఆంధ్రజ్యోతి): మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బట్టు దేవానంద్ ఒక రోజు పర్యటన నిమిత్తం గురువారం జిల్లా కేంద్రానికి చేరుకున్నారు. గతంలో రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తిగా ఉన్న కాలంలో విజయనగరం జిల్లా పోర్టుపోలియో జడ్జిగా పలు మార్లు జిల్లాను సందర్శించారు. జిల్లాకు వచ్చిన జస్టిస్ దేవానంద్‌ను జిల్లా ప్రధాన న్యాయాధికారి సాయి కల్యాణ చక్రవర్తి, పలువురు న్యాయాధికారులు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు హరీష్, కార్యదర్శి సంతోష్, సీనియర్ న్యాయవాది తమ్మన్నశెట్టి, బొడ్డు సత్యనారాయణ, నాలుగెస్సలు రాజు కలిశారు.

ఇళ్లపై జెండాలు ఎగురవేద్దాం

జామి: ప్రతి ఇంటిపై జాతీయ జెండాలు ఎగురవేయాలని బీజేపీ విశాఖ పార్లమెంటు ప్రధాన కార్యదర్శి దానేష్ అన్నారు. గురువారం జామిలో మండల పార్టీ అధ్యక్షురాలు రాయవరపు ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దానేష్ మాట్లాడుతూ ఈ నెల 11 నుంచి 14వరకు అన్ని నియోజకవర్గాల్లో బైక్ ర్యాలీలు, సమర యోధులు, జాతీయ వీరుల విగ్రహాల వద్ద స్వచ్ఛభారత్ నిర్వహించనున్నట్టు తెలిపారు. బీజేపీ ప్రతినిధులు పి. వెంకటభాస్కర్, కాపుగంటి వెంకటేష్, కుమారి, ప్రదీప్, చైతన్య, కె.కుమార్, అనిల్ తది తరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల హర్షం

శృంగవరపుకోట: సీఎం నారా చంద్రబాబు నాయుడు చిత్రపటానికి గురువారం శృంగవరపుకోట మండల రేషన్ డీలర్లు క్షీరాభిషేకం చేశారు. రెండు రోజుల క్రితం జరిగిన కలెక్టర్ల సమావేశంలో రేషన్ డీలర్ల పాత వ్యవస్థను పునరిద్ధరిస్తామని చెప్పడం సంతోషంగా ఉందని సంఘ మండల అధ్యక్షుడు, జిల్లా కన్వీనర్ కొణదం ఉమాశంకరావు పేర్కొన్నారు. సంఘ సభ్యులు సీహెచ్ అప్పారావు, రాణి, రవి, కుమారి, జగన్నాథం తదితరులు వున్నారు.

పాత కాంప్లెక్స్‌ను వినియోగంలోకి తెండి

రాజాం: కొత్తగా కాంప్లెక్స్ నిర్మాణ పనులు చేపట్టిన తరువాత పాత ఆర్టీసీ కాంప్లెక్స్ స్థలాన్ని వినియోగంలోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ జె.రామప్పలనాయుడును ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ ఆదేశించారు. గురువారం పాత కాంప్లెక్స్‌ను పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. కాంప్లెక్స్ ఆవరణలో నిర్మించిన షాపులను, గతంలో ఆర్ అండ్ బీఈ డీఈఈ కార్యాలయం ఉన్న ఖాళీ స్థలాన్ని వినియోగంలోకి తీసుకు రావాలన్నారు. ఆయనతో పాటు పార్టీ నాయకులు నంది సూర్యప్రకాష్‌రావు, వంగా వెంకటరావు, శాసపు రాజేష్ కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆటల పోటీలు

బొబ్బిలి రూరల్: పిరిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆటల పోటీలు నిర్వహిస్తున్నారు. పి.డి. నల్ల వెంకటనాయుడు ఆధ్వర్యంలో పోటీలు సాగుతున్నాయి. విజేతలకు ఈ నెల 15న బహుమతులు అందిస్తారు.

ఎరువుల పంపిణీ

వంగర: వంగర, మద్దివలస, సీతారాంపురం, బాగెమ్మపేట తదితర గ్రామాల్లోని ఆర్‌బీకేలలో గురువారం ఎరువులు పంపిణీ చేశారు. ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో 'పర్యవేక్షణ లేక ...ఎరువులు దొరక్క' శీర్షికన ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. గ్రామాల్లోని ఆర్బీకేలకు ఎరువులు సరఫరా చేశారు. రైతులకు పంపిణీ చేశారు. వ్యవసాయాధికారి కన్నబాబు ఎరువుల షాపులు తనిఖీ చేశారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం

వంగర: గ్రామ స్థాయిలో ఉన్న సమస్యలు గుర్తించి పరిష్కరించడానికే ప్రభుత్వం గ్రామ సందర్శన కార్యక్రమాన్ని రూపొందించిందని మండల ప్రత్యేకాధికారి సందీప్ అన్నారు. తలగాంలో గురువారం గ్రామదర్శిని కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. గ్రామంలో సమావేశం నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

బాడంగి: గజరాయనివలసలో గురువారం గ్రామ సందర్శన కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని సమస్యలను అధికారులు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సత్తిబాబు, వైస్ సర్పంచ్ కామినాయుడు, ఎంపీటీసీ పాలవలస గౌరి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

డయేరియాపై అవగాహన ర్యాలీ

రాజాం: స్థానిక వస్త్రపురి కాలనీలో స్టాప్ డయేరియా కార్యక్రమంలో భాగంగా కమిషనర్ జె.రామప్పలనాయుడు ఆధ్వర్యంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. డయేరియా బారిన పడకుండా తీసుకో వాల్సిన జాగ్రత్తలను వివరించారు. శానిటరీ ఇన్ స్పెక్టర్ చేగొండి ప్రసాద్, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి రాజుకు ఘన నివాళి

బొబ్బిలి, ఆగస్టు 8: బొబ్బిలి రాజా ఆర్‌వీజీకే రంగారావు 98వ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన తనయుడు, ఎమ్మెల్యే బేబీనాయన గురువారం ఘనంగా నివాళులు అర్పించారు. స్థానిక తారక రామ కాలనీ సమీపంలో గల స్మృతివనం దగ్గరికి బేబీనాయన వెళ్లి రాజా సమాధి దగ్గర సంప్రదాయ సిద్ధంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రెడ్డి రామమూర్తి, బదరి ప్రసంగించారు. దివంగత రాజా రంగారావుతో ఉన్న గత అనుభవాలను నెమరువేసుకున్నారు. కార్యక్రమంలో పార్వతీపురం మాజీ ఎం.ఎల్.ఎ బొబ్బిలి చిరంజీవులు, స్థానిక టీడీపీ నేతలు పువ్వల శ్రీనివాసరావు, సుంకరి సత్తి బాబు, ఏగిరెడ్డి శ్రీధర్, కౌన్సిలర్‌లు బొత్స సురేష్, కళ్యంపూడి సత్యనారాయణ, సింగనాపల్లి ఈశ్వరరావు, తెంటు వెంకటప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.



రాజా ఆర్వీజీకే రంగారావుకు నివాళి అర్పిస్తున్న బేబీనాయన

● బొబ్బిలి సంస్థానం ఉన్నత పాఠశాల, రాజా ఆర్.ఎస్.ఆర్.కె రంగారావు కళాశాల, శ్వేతాచలపతి ఇంగ్లీష్ మీడియం పాఠశాలల్లో దివంగత రాజా ఆర్వీజీకే రంగారావు వర్ధంతి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు.

ఆసుపత్రుల్లో మౌలిక వసతులు కల్పించాలి

● ఉత్తరాంధ్ర అభివృద్ధి ఐక్యవేదిక ప్రధాన కార్యదర్శి అజశర్మ

కురుపాం: ఆసుపత్రుల్లో మౌలిక వసతులతో పాటు సిబ్బంది, మందులు అందుబాటులో ఉండేటట్లు చూడాలని ఉత్తరాంధ్ర అభివృద్ధి ఐక్య వేదిక ప్రధాన కార్యదర్శి అజశర్మ కోరారు. కురుపాం సీహెచ్‌సీని ఆయన గురువారం సందర్శించారు. ఈసందర్భంగా ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, సిబ్బంది వివరాలు, మౌలిక సదుపాయలపై ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.శోభరాణికి అడిగి తెలుసుకున్నారు. మలేరియా కేసులపై ఆరా తీశారు. ఉత్తరాంధ్ర ఐక్యవేదిక నాయకులు ఎం.ప్రదీప్‌కుమార్, పీఎస్ ప్రసాదరావు, గిరిజన సంఘం నాయకులు ఎం.శ్రీనివాసరావు, పువ్వల తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురంటౌన్: మన్యం జిల్లా కేంద్రం పార్వతీపురంలో జరుగుతున్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక కన్వీనర్ ఎ.అజశర్మ కోరారు. గురువారం జిల్లా ఆసుపత్రిలో ముందుగా వైద్య సేవలకు సంబంధించి రోగులను ఆరా తీశారు. పనులు ఎంత వరకు వచ్చాయో ఆసుపత్రి సూపరింటెండెంట్ వాగ్దేవిని అడిగి తెలుసుకున్నారు. పాలకొండ, పార్వతీపురం, సాలూరు ఆసుపత్రులలో రక్త నిధి కేంద్రాలను ఏర్పాటు చేయాలని, డిమాండ్ చేశారు.



కురుపాం: సిబ్బందితో మాట్లాడుతున్న అజశర్మ

● **సాలూరు:** వంద పడకల ఆసుపత్రిని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఉత్తరాంధ్ర అధ్యయన వేదిక డిమాండ్ చేసింది. ఉత్త రాంధ్ర అధ్యయన వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ ఆధ్వర్యంలోని బృందం పట్టణంలోని వంద పడకల ఆసుపత్రిని గురు వారం పరిశీలించింది. ఆసుపత్రి సూపరెంటెండెంట్ సూర్యకుమారితో మాట్లాడా రు. అనంతరం రోగులతో మాట్లాడి ఆరోగ్య సేవలు ఎలా అందుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. అనంతరం అజశర్మ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ వంద పడకల ఆసుపత్రి నిర్మాణానికి భూమి పూజ చేసిందని.. ఇప్పుడు మళ్లీ కూటమి ప్రభుత్వం భవన నిర్మాణ పనులు పూర్తి చేయాలని కోరారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రతినిధి బృందం నాయకులు ప్రదీప్ కుమార్, ప్రసాదరావు, సాలూరు పట్టణ నాయకులు ఈశ్వరరావు, ఎం.శ్రీనువాసరావు, ఎన్.వై.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల షాపుల తనిఖీ

బాడంగి: మండలంలో గల రామలక్ష్మి ట్రేడర్స్, వాసవి ఫెర్టిలైజర్స్‌ను వ్యవసాయాధికారి కె.శిరీష గురువారం తనిఖీ చేశారు. ఎరువుల శాంపిల్స్‌ను సేకరించి నాణ్యతా ప్రమాణాలు పరిక్షించడానికి ప్రయోగశాలకు పంపించారు. ఆమె వెంట ఏఈవో పుష్పలత ఉన్నారు.

కృత్రిమ అవయవాలకు ఎంపిక

కొత్తవలస: మంగళపాలెం గ్రామంలోనున్న గురుదేవ చారిటబుల్ ట్రస్టులో గురువారం బరజిలై ఫౌండేషన్, చేతన్ ఫౌండేషన్ సహకారంతో దివ్యాంగులకు ఉచితంగా కృత్రిమ అవయవాలను అందించడానికి స్క్రీనింగ్ క్యాంపు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఈ రెండు ఫౌండేషన్‌లకు చెందిన డి.సీతారామయ్య, షేక్ రషీద్, చంద్రకాంత్ నవీన్ హాజరయ్యారు. 50 మంది దివ్యాంగులకు అవయవాలను అందించడానికి కొలతలను తీసుకున్నారు. ట్రస్టు చైర్మన్ రాపర్తి జగదీష్ బాబు మాట్లాడుతూ కొలతలు తీసుకున్న దివ్యాంగులకు త్వరలోనే కృత్రిమ అవయవాలను అందించనున్నట్టు తెలిపారు. వైస్ చైర్మన్ వి.ఫణీంద్ర, ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి

రాజాం: సర్పంచులు, పంచాయితీ కార్యదర్శులు సమన్వయంతో పనిచేసి గ్రామాభివృద్ధికి కృషి చేయాలని ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు సూచించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, పంచాయితీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో జీవితం నాశనం చేసుకోవద్దు

శృంగవరపుకోట: మత్తుమందు, మాదక ద్రవ్యాల వాడకంతో భవిష్యత్ నాశనం చేసుకోవద్దని శృంగవరపుకోట జూనియర్ న్యాయాధికారి సబ్బవరపు వాణి విద్యార్థులకు సూచించారు. గురువారం స్థానిక చైతన్య డిగ్రీ కళాశాలలో మండల న్యాయ సేవా సదస్సు ఆధ్వర్యంలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. శృంగవరపుకోట మీదగా తరచూ గంజాయి అక్రమ రవాణా జరుగుతుందని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.సూరిదేముడు పేర్కొన్నారు. ఏజీపీ అల్లు సత్యాజీ, సీనియర్ న్యాయవాది గేదల ప్రకాష్ తదితరులున్నారు.



మాట్లాడుతున్న న్యాయాధికారి

న్యాయ అవగాహన సదస్సు

బొబ్బిలి: స్థానిక ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రిలో గురువారం సాయంత్రం సీనియర్ సివిల్ న్యాయాధికారి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్‌పర్సన్ ఎ.స్.అ.ఇ.ణ.శ్రీ ఆధ్వర్యంలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. మానసిక, శారీరక వైకల్యంతో బాధపడే వారి కోసం కల్పిస్తున్న హక్కులు, సౌకర్యాలను ఆమె వివరించారు. తొలుత ఆసుపత్రిలో గల రోగుల వార్డులను, ఇతర విభాగాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ గేదెల శశిభూషణరావు, ఎంపీడీఓ రవికుమార్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయాధికారి అరుణశ్రీ

రఘురాజు వ్యాజ్యంలో ప్రతివాదులకు హైకోర్టు నోటీసులు

అమరావతి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారన్న ఆరోపణలతో తనపై అనర్హత వేటు వేస్తూ శాసనమండలి చైర్మన్ ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ ఎమ్మెల్సీ రఘురాజు దాఖలు చేసిన వ్యాజ్యం గురువారం హైకోర్టు ముందు విచారణకు వచ్చింది. ఈ వ్యవహారంపై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులుగా ఉన్న శాసన మండలి సెక్రెటరీ జనరల్, ట్రిబ్యునల్ చైర్మన్, మండలి చైర్మన్, విప్, రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యదర్శి, శాసనవ్యవహారాల కార్యదర్శికి హైకోర్టు నోటీసులు జారీచేసింది. విచారణను వచ్చే వారానికి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జి.నరేందర్, జస్టిస్ మండవ కిరణ్మయితో కూడిన ధర్మాసనం గురువారం ఆదేశాలిచ్చింది. శాసనమండలి విప్ పాలవలస విక్రాంత్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా తనపై అనర్హత వేటు వేస్తూ శాసన మండలి చైర్మన్ ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ మాజీ ఎమ్మెల్సీ రఘురాజు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. మండలి చైర్మన్ ఉత్తర్వుల అమలును నిలుపుదల చేయాలని కోరారు. స్థానిక సంస్థల కోటా కింద తన స్థానం ఖాళీ అయినట్లు పేర్కొంటూ ఎలాంటి నోటిఫికేషన్ ఇవ్వకుండా ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని కోరారు. ఈ వ్యాజ్యంపై ఇటీవల విచారణ జరిపిన హైకోర్టు రఘురాజు ప్రాతినిధ్యం వహించిన ఎమ్మెల్సీ స్థానం ఖాళీ అయినట్లు నోటిపై చేయవద్దని ఎన్నికల సంఘాన్ని ఆదేశిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. గురువారం ఈ వ్యాజ్యం మరోసారి విచారణకు రాగా ధర్మాసనం స్పందిస్తూ... ప్రస్తుతం అధికార పక్షంలోనే ఉన్నారు కదా..? పిటిషన్‌ను ఉపసంహరించుకొని, తిరిగి ఎన్నికల్లో పోటీ చేయవచ్చు కదా..? అని సరదాగా వ్యాఖ్యానించింది. రఘురాజు న్యాయవాది సార్వభౌమారావు వాదనలు వినిపిస్తూ... పిటిషనర్‌పై అనర్హత వేటు వేసే విషయంలో నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించలేదన్నారు. ఈ విషయంలో వాదనలు వినిపిస్తామన్నారు. అనర్హతపై వ్యాజ్యాలను 8 వారాల్లో పరిష్కరించాలని సుప్రీంకోర్టు తీ ర్పు ఇచ్చిందని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ధర్మాసనం ప్రతివాదులకు నోటీసులు జారీచేస్తూ విచారణను వాయిదా వేసింది.

త్వరలో విద్యార్థి సంఘాల నిరసనకు శ్రీకారం

విజయనగరం దాసన్నపేట: జేఎన్‌టీయూ జీవీలో సమస్యలపై త్వరలో విద్యార్థి సంఘాలు నిరసనకు సిద్ధమౌతున్నాయని జనసేన నాయకుడు గురాన అయ్యలు అన్నారు. గురువారం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో యూనివర్సిటీ నిర్లక్ష్యానికి గురైందన్నారు. యూనివర్సిటీలో బోధన, బోధనేతర సిబ్బందిని చట్ట వ్యతిరేక బదిలీలు చేశారన్నారు. ఈ చట్ట వ్యతిరేక బదిలీలపై ప్రభుత్వ పెద్దలు, జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టి సారించి ప్రతిష్టాత్మకంగా జేఎన్‌టీయూ జీవీలో చదువుతున్న వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేసి, విశ్వవిద్యాలయం అభివృద్ధికి తోడ్పడాలన్నారు.

మహిళలు వ్యాపార రంగంలో దూసుకుపోవాలి

విజయనగరం దాసన్నపేట: మహిళలు వృత్తి, నైపుణ్య కోర్సుల్లో శిక్షణ పొంది వ్యాపార రంగంలో దూసుకుపోవాలని జన శిక్షణ సంస్థాన్ డైరెక్టర్ వి.హరీష్ సూచించారు. జనశిక్షణ సంస్థాన్‌లో శిక్షణ పొందిన 30 మంది మహిళలకు మూడు రోజుల పాటు జనరేట్ యువర్ బిజినెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గురువారం ముగింపు కార్యక్ర మంలో హరీష్ మాట్లాడుతూ శిక్షణ సమయంలో నేర్చుకున్న అంశాలతో వ్యాపార రంగంలో ముందుకు పోవాలన్నారు. జన శిక్షణ సంస్థాన్ ప్రతినిధులు కోటేశ్వరరావు, సోమేశ్వరరావు, గణేష్, రవీంద్ర, ఏపీఎస్‌డీసీ సిబ్బంది పాల్గొన్నారు.

అవయవదాన వారోత్సవాలు

విజయనగరం దాసన్నపేట: నగర శివార్లలోని ఆర్‌కే టౌన్‌షిప్‌లో జీఎంఆర్ ఉపాధి శిక్షణ సంస్థ ప్రాంగణంలో గాంధీ బ్లడ్ డోనర్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం అవయవ దాన వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎంఆర్ సంస్థ ప్రతినిధి కె.వెంకట రమణ మాట్లాడారు.

వ్యక్తి ఆత్మహత్య

● ఇటీవలే కుమారుడు మృతి చెందడంతో మనస్తాపం

రామభద్రపురం, ఆగస్టు 8: మండల పరిధిలోని ముచ్చర్లవలస గ్రామంలో రెండు వారాల వ్యవధిలోనే తండ్రీ కొడుకులు ఆత్మహత్య తీవ్ర విషాదం నింపింది. దీనికి సంబంధించి ఎస్ఐ జ్ఞానప్రసాద్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన నడగాన రవణ(55) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి ముగ్గురు కుమారులు కాగా చిన్న కుమారుడు నడగాన సురేష్(24) గతనెల 24న ఆత్మహత్య చేసుకుని మృతి చెందాడు. దీంతో మనస్తాపం చెందిన తండ్రి రమణ గ్రామంలోని పొలంలో బుధవారం సాయంత్రం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీంతో అపస్మారక స్థితికి చేరుకున్న రమణను స్థానికులు బాడంగి సీహెచ్‌సీకి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి నుంచి విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు. మృతుని భార్య జయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ జ్ఞానప్రసాద్ తెలిపారు.

దాడి ఘటనలో ముగ్గురికి గాయాలు

● ఆరుగురిపై కేసు నమోదు

భామిని: భామిని గ్రామంలో గురువారం జరిగిన దాడి ఘటనలో ముగ్గురు తీవ్ర గాయాలపాలయ్యారు. స్థానిక పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. భామిని గ్రామానికి చెందిన జి.సురేష్ అనే రైతు గురువారం తన పొలంలో మొక్కలు నాటుతున్నాడు. ఇంతలో సరిహద్దు పొలానికి చెందిన కొందరు యాదవులు అక్కడికి వచ్చి, తమ పొలానికి ఆనుకుని ఎందుకు మొక్కలు నాటుతున్నావని దాడికి దిగారు. ఈ విషయాన్ని సురేష్ తమ బంధువులకు సమాచారం అందించారు. సురేష్ బంధువులు అక్కడకు వస్తున్నారని తెలుసుకున్న యాదవులు లివిరి గ్రామ సమీపంలో అడ్డగాసి, కర్రలు, కత్తులతో దాడికి దిగారు. దీంతో జి.లక్ష్మీపతి, జి.రాజు, భూపతిలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే వారిని భామిని పీహెచ్‌సికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం సీతంపేట ఏరియా ఆసుపత్రికి 108 వాహనంలో తరలించారు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ ప్రసాద్ గాయపడిన ముగ్గురు వ్యక్తుల నుంచి స్టేట్‌మెంట్ తీసుకున్నారు. లివిరి గ్రామానికి చెందిన ఆరుగురు యాదవులపై కేసు నమోదు చేశారు.

యువకుడిపై దాడి

పూసపాటిరేగ: మండలంలో రెల్లివలస గ్రామానికి చెందిన పతివాడ షణ్ముఖరావు అనే యువకుడిపై డెంకాడ మండలంలో గల మహంతిపేటకు చెందిన కొందరు దాడికి పాల్పడ్డారు. దీనికి సంబంధించి స్థానికులు, బంధువులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బుధవారం రాత్రి సుమారుగా 11గంటల ప్రాంతంలో యువకుడు మహంతిపేట వెళ్లగా అక్కడివారు కొందరు ఇతడిపై దాడిచేసి అతిదారుణంగా కొట్టారని తెలిపారు. రాడ్‌లతో కాళ్లు, చేతులపై కొట్టారని, తరువాత మండలంలో పాతకొప్పెర్ల, రెల్లివలస వెళ్లేదారిలో పడేసి వెళ్లిపోయినట్టు తెలిపారు. గాయాలతో బాధితుడు రెల్లివలస చేరగా వైద్యం నిమిత్తం విజయనగరంలో ఒక ప్రయివేటు ఆసుపత్రిలో చేర్పామన్నారు. బాధితుడు ఇంజినీరింగ్ ఆఖరి సంవత్సరం చదువుతున్నట్లు తెలిపారు. దీనిపై స్థానిక ఎస్ఐ సన్యాసిరావును అడుగగా ఇది మహంతిపేటలో జరిగిందని అక్కడే కేసును నమోదు చేస్తారని, తదుపరి దర్యాప్తును నిర్వహిస్తారని తెలిపారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

రేగిడి: మండలంలో తునివాడ ఇసుక రేవునుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లపై బుధవారం రాత్రి కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. లచ్చరాయపురం వద్ద నిర్వహించిన తనిఖీలో పట్టుబడగా వీటి నిర్వాహకులపై కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అదుపు తప్పిన మినీ వ్యాన్

కురుపాం: కురుపాం ప్రదీప్ నగర్ కాలనీ సమీపంలో పార్వ తీపురం నుంచి గుమ్మలక్ష్మీపురం వెళ్తున్న బోలెరా వాహనం గురు వారం తెల్లవారుజామున రోడ్డు పక్క ఉన్న టిఫిన్ బండిని ఢీ కొని కాలువాలో పడింది. వాహ నంలో ఉన్నవారికి ఎటువంటి దె బ్బలు తగలు లేదు. ఘటన జరి గిన సమయంలో ఎవరూ లేకపోవడంతో ఎవరికి ఏమి జరగలేదు.

బీసీజీ వ్యాక్సిన్‌ను వినియోగించుకోండి

బొండపల్లి: బొండపల్లి పీహెచ్‌సీ, గొట్లాం వెల్‌నెస్ సెంటర్‌ను డీఎంహెచ్‌వో భాస్కరరావు గురువారం సందర్శించారు. వయోజనుల బీసీజీ వ్యాక్సిన్ వినియోగంపై ఆయన ఆరా తీశారు. ఆరోగ్య కేంద్రాల్లో అందిస్తున్న సేవలు, ఓపీని జాబితాలను పరిశీలించారు. మెడికల్ షాపులను అబా ఐడీతో రిజిస్ట్రేషన్ చేయాలని సూచించారు. అనంతరం గొట్లాం వెల్‌నెస్ సెంటర్‌ను పరిశీ లించేందుకు వెళ్లగా రోడ్డుమార్గం లేకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. వైద్యాధి కారులు గులిపల్లి ప్రమీళ, ఎల్.సత్యనారాయణ, హెల్త్ సూపర్‌వైజర్ ఎస్‌పి. భాషా, హెల్త్ అసిస్టెంట్ బి.విశ్వేశ్వరరావులతోపాటు ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

నెల్లిమర్లలో మునిసిపల్ ఆర్డీ పర్యటన

నెల్లిమర్ల: నగర పంచాయతీలో పురపరిపాలన శాఖ రీజనల్ డైరెక్టర్ జి.నాగరాజు గురువారం పర్యటించారు. పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, సచివాలయాల పనితీరుపై ఆరా తీశారు. అనంతరం సచివాలయాల సిబ్బందితో సమీక్ష సమావేశం ఏర్పాటుచేసి, ప్రగతి పనులపై అడిగి తెలుసుకున్నారు. అన్న క్యాంటీన్ నిర్మాణ పనులను పరిశీలించారు. నగర పంచాయతీ కమిషనర్ పి.బాలాజీప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ డి.ఉమాభాస్కర్, సిబ్బంది పాల్గొన్నారు.

సమన్వయంతో ముందుకు వెళ్లాలి

నెల్లిమర్ల: సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో ముందుకు వెళ్తూ గ్రామాల్లో అభివృద్ధిని సాధించాలని ఎంపీడీవో జి.రామారావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లకు, కార్యదర్శులకు మూడు రోజుల పాటు జరగనున్న శిక్షణా కార్యక్రమాన్ని ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ శిక్షణలో నిధుల ఖర్చు, అభివృద్ధి ప్రణాళికలు, ప్రణాళికల అమలు తదితర విషయాలు ఉంటాయన్నారు

పంచాయతీల అభివృద్ధికి కృషి చేయండి

రేగిడి: గ్రామ పంచాయితీల అభివృద్ధికి సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు కృషి చేయాలని ఈవోఆర్డీ సత్యనారాయణ, రిసోర్స్ పర్సన్లు వై.హేమసుందరావు, పి.గోపాల్‌నాయుడు, కె.రాజేంద్ర సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సర్పంచులు, కార్యదర్శుల శిక్షణ శిబిరం గురువారం ప్రారంభమైంది.

ప్రజలకు జవాబుదారీగా ఉండాలి

● గ్రామ సందర్శనలో ఉన్నతాధికారులు ● జిల్లా వ్యాప్తంగా పర్యటనలు, పరిశీలనలు

ప్రజలకు ప్రభుత్వ అధికారులు జవాబుదారీగా వ్యవహరించి వారి యొక్క సమస్యలు వినడంతో పాటు వాటి పరిష్కారానికి కృషి చేయాలని పలువురు అధికారులు కోరారు. గురువారం జిల్లా వ్యాప్తంగా గ్రామ సందర్శన కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల్లో పర్యటించి సమస్యలను పరిశీలించారు. స్థానిక అధికారులను ప్రశ్నించి, పలు సూచనలు చేశారు.



బొబ్బిలిరూరల్: నారాయణప్పవలసలో...



రేగిడి: ఖండ్యాంలో..



వేపాడలో..



రామభద్రపురం:తారాపురంలో..



బొబ్బిలిలో..

ప్రశాంతంగా ఎస్ఎంసీ ఎన్నికలు

- పలుచోట్ల ఏకగ్రీవం.. కొన్నిచోట్ల ఇరు పార్టీల మధ్య పోటీ
- ప్రమాణస్వీకారం చేసిన చైర్మన్, వైస్‌చైర్మన్లు
- కోరం లేక కొన్ని వాయిదా
- పలుచోట్ల స్వల్ప ఘర్షణలు


గజపతినగరం: ఉన్నత పాఠశాల చైర్మన్‌ను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు


చీపురుపల్లి: పోలీస్ లైన్ పాఠశాలలో ప్రమాణం చేస్తున్న కమిటీ సభ్యులు


నెల్లిమర్ల: అలుగోలులో ప్రమాణ స్వీకారం చేస్తున్న ఎస్ఎంసీ చైర్మన్, వైస్‌చైర్మన్


విజయనగరం రూరల్: జొన్నవలసలో విజయం సాధించిన వారితో టీడీపీ నాయకులు


రామభద్రపురం: కొట్టక్కి పాఠశాలలో ఎన్నికల ప్రక్రియను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఈవో మోహనరావు

స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం ప్రశాంతంగా ముగిశాయి. పలుచోట్ల కోరం లేక వాయిదా పడ్డాయి. కొన్ని ఏకగ్రీవం కాగా, కొన్నిచోట్ల పోటీ నెలకొంది. పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

బొబ్బిలి: బొబ్బిలి మున్సిపాలిటీ, మండల పరిధిలో మొత్తం 91 పాఠశాలలు ఉండగా ఒక్క అన్నంనాయుడువలస మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మినహా మిగిలిన 90 పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయి. 56 పాఠశాలల్లో ఏకగ్రీవ ఎన్నికలు జరిగాయి. మండలంలోని అన్నంనాయుడువలస పాఠశాలలో ఒక్క విద్యార్థి కూడా లేకపోవడంతో కూడా అక్కడ ఎన్నిక అవసరం లేకుండా పోయింది. మండలంలోగల పది జిల్లా పరిషత్ హైస్కూళ్లలో వైసీపీ నేత శంబంగి వెంకటచిన అప్పలనాయుడు స్వగ్రామమైన పక్కిలో మినహా మిగిలిన 9 ఎస్ఎంసీలు టీడీపీ ఖాతాలోనికి వెళ్లినట్లు చెబుతున్నారు. ● **జామి:** మండలంలోని ఎస్ఎంసీ ఎన్నికల్లో దాదాపు 98శాతం కూటమి బలపరిచిన అభ్యర్థులు గెలిచారు. మండలం మొత్తం 51 పాఠశాలలు ఉండగా దాదాపు అన్ని పాఠశా లల్లో కూటమి అభ్యర్థులు విజయం సాధించారు. ● **శృంగవరపుకోట:** మండలంలోని 47 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు, 6 ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలు, 9 ప్రభుత్వ, జిల్లా పరిషత్, ఏపీఆర్ఎస్, టీడబ్ల్యూ ఆశ్రమ పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలు జరిగాయి. ● **వేపాడ:** మండలంలోని 50 పాఠశాలలో గురువారం నిర్వహించిన ఎస్ఎంసీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయి. వేపాడ జడ్పీ ఉన్నత పాఠశాల, బక్కునాయుడుపేట ఆదర్శ పాఠశాల, కస్తూర్బా పాఠశాలను డీఈవో ప్రేమ్‌కుమార్ సందర్శించి ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహిచాలని సూచించారు. ● **రాజాం:** మండలంలోని జోలపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఆగూరు మండల పరిషత్ ఉన్నత పాఠశాల, సీతంపేట ప్రాథమిక పాఠశాలల్లో టీడీపీ, వైసీపీ నాయకుల మధ్య సఖ్యత లేని కారణంగా ఎన్నిక వాయిదా పడింది. ● **రేగిడి:** మండలంలో గురువారం నిర్వహించిన ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. చిన్నపాటి ఘర్షణలు, కోరం లేకపోవటం వంటి కారణాలతో చిన్నశిర్లాం, తునివాడ, మునకలవలస, సోమరాజుపేట పాఠశాలల ఎన్నికలు అర్ధంతరంగా నిలిచిపోయాయి. సోమరాజుపేటలో మెంబర్ల ఎన్నిక పూర్తయినా, చైర్మన్ ఎన్నికలో స్వల్ప ఘర్షణ తలెత్తటం, ఎన్నికల నిర్వహణాధికారి హెచ్ఎం తల్లి మృతిచెందటంతో చైర్మన్ ఎన్నిక మధ్యలో నిలిపివేశారు. ఎన్నిక జరిగిన 81 పాఠశాలలో ఒకటి రెండు తప్పితే అన్నింటా టీడీపీ మద్దతుదార్లు చైర్మన్, వైస్ చైర్మన్లుగా కైవసం చేసుకొన్నారు. ● **బొబ్బిలి రూరల్:** మండలంలో పిరిడి జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు జరిగా యి. గొల్లపల్లిలో శ్రీవేణుగోపాల● మున్సిపల్ హైస్కూల్లో, అలజంగి సీబీఎం పాఠశాలలో, కోమటిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో, జగన్నాధపురం ప్రాథమిక పాఠశాలలో, నందబలగ ప్రాథమిక పాఠశాలలో చైర్మన్‌లు ప్రమాణ స్వీకారం చేశారు. ● **బాడంగి:** మండలంలోని కోడూరు గ్రామంలో టీడీపీ మరోసారి పట్టునిలుపుకుంది. పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికల్లో టీడీపీ మద్దతుదారులు విజయఢంకా మోగించారు. ● **కొత్తవలస:** మండలంలో స్కూల్ కమిటీల ఎన్నికల్లో వైసీపీ మద్దతుదారులు పోటీలో నిలబడక పోవడంతో అన్ని పాఠశాలల్లో ఎన్నికలు ఏకగ్రీవం అయ్యాయి. మండలంలో 64 ప్రాథమిక పాఠశాలలు ఉండగా వాటిలో ఒకే విద్యార్థి ఉన్న వియ్యంపేట, ముమ్మనపాలెం గ్రామాలకు చెందిన పాఠశాలలో ఆ విద్యార్థుల తల్లితండ్రులే అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. కాటకాపల్లి, యర్రవానిపాలె, మంగళపాలెం పాఠశాలలో ముగ్గురు విద్యార్థులు, అర్దానపాలెం పాఠశాలలో 4గురు విద్యార్థులు, రాయపురాజుపేట, రెల్లి పాఠశాలలో ఆరుగురు విదాయర్థులు, కంటకాపల్లి, సంతపాలెం పాఠశాలలో ఏడుగురు విద్యార్థులు, అడ్డూరువానిపాలెం, అర్దానిపాలె కాలనీలలో 8 మంది విద్యార్థులు, అప్పన్నపాలెం, చిన మన్నిపాలెం, తుమ్మికాపల్లి పాఠశాలలో 9 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు. ఈ పాఠశాలలకు కూడా ఎన్నికలు నిర్వహించారు. ● **విజయనగరం రూరల్:** విజయనగరం అర్బన్, రూరల్ ప్రాంతాల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికలు గురువారం ప్రశాంతంగా ముగిశాయి. 122 స్కూల్స్‌కి గాను, 122కి కమిటీలు పూర్తి చేశారు. మండల విద్యాశాఖాధికారులు ఎంపికైన కమిటీ పేర్లను జిల్లా విద్యాశాఖాధికారికి నివేదిక అందజేశారు. అధిక శాతం పాఠశాలల్లో కమిటీలు కూటమి ఖాతాలోకే వెళ్లాయి. ● **తెర్లాం:** మండలంలో స్కూల్ కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయని మండల విద్యాశాఖాధికారి జే.త్రినాథరావు తెలిపారు. మండలంలో మొత్తం 67 పాఠశాలలకు గానూ 60 పాఠశాలలు ఏకగ్రీవమైందని, 7 పాఠశాలలకు ఎన్నికలు జరిగాయని తెలిపారు. ఈ ఎన్నికల్లో ఒకచోట మాత్రం కోరంలేక ఎన్నిక నిలుపుదల చేసినట్టు తెలిపారు. ● **లక్కవరపుకోట:** మండలంలో గురువారం జరిగిన ఎస్ఎంసీ ఎన్నికల్లో టీడీపీ సత్తా చాటింది. మొత్తం 52 పాఠశాలల్లో టీడీపీ అభ్యర్థులు విజయకేతనం ఎగురవేశారు. 40 చోటల ఏకగ్రీవం కాగా మిగతా 12 చోట్ల ఎన్నికలు నిర్వహించారు. టీడీపీ అభ్యర్థుల విజయం సాధించారు. ● **రామభద్రపురం:** మండలంలో 57 పాఠశాలలకు గానూ 21 పాఠశాలలు ఏకగ్రీవం కాగా 36 పాఠశాలల్లో ఎన్నికలు నిర్వహించారు. కొట్టక్కి హైస్కూల్‌లో డిప్యూటీ డీఈవో కే.మోహనరావు ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. ● **బొండపల్లి:** మండలంలోని 43 ప్రాథమిక, 3 ప్రాథమికోన్నత, 8 ఉన్నత పాఠశాలలతోపాటు దేవపల్లి కేజీబీవీ, పాఠశాలలకు మొత్తం 55 పాఠశాలల్లో యాజమాన్య కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ● **నెల్లిమర్ల:** మండలంలోని 73 పాఠశాలలకుగాను రెండు మినహా అన్ని పాఠశాలల్లోనూ ఎస్ఎంసీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయ. జరజాపుపేట, గుషిణి పాఠశాలలోనూ ఎన్నికలు వాయిదా పడ్డాయి. ● **భోగాపురం:** మండలంలో గురువారం అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించిన స్కూల్ కమిటీ ఎన్నికలు ప్రసవాంతగా ముగిశాయి. ● **పూసపాటిరేగ:** మండలంలో పాఠశాలల కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయి. మొత్తం 84పాఠశాలలకుగాను 62పాఠశాలలలో ఏకగ్రీవంగా ఎన్నుకోగ, 22 పాఠశాలలో ఎన్నికలు నిర్వహించారు. ● **గరివిడి:** మండలంలో 62 ప్రభుత్వ పాఠశాలలకుగాను 59 పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించారు. అర్తమూరు, వెదుళ్లవలస గ్రామాల్లోగల పాఠశాలల్లో ఇరు పార్టీల నేతల మధ్య ఘర్షణలు జరగడంతో అధికారులు అక్కడ ఎన్నికలను వాయి దా వేశారు. కందిపేటలో కోరం లేకపోవడంతో ఎన్నికలు వాయిదా పడ్డాయి. ● **దత్తిరాజేరు:** మండలం లోని 67 పాఠశాలలకుగాను 61 ఎన్నికలు జరగగా 6 పాఠశాలలు కోరం లేక వాయిదా పడ్డాయి. మండలంలోని చినకాద-2, ఎం.లింగాలవలస-1, పాచలవలస-1, పెదకాద-1, వంగర-1 పాఠశాలలు కోరం లేక ఎన్నికలు వాయిదా వేసినట్టు తెలిపారు. ● **చీపురుపల్లి:** మండలంలోని 67 పాఠశాలల కుగాను 62 పాఠశాలల్లో ప్రశాంతంగా ఎన్నికలు జరిగాయి. చీపురుపల్లి బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలు, రామలింగ పురం (యూపీ), గుణిదాం, ఆర్టివలస పాఠశాలల్లో కోరం లేక ఎన్నిక వాయిదా పడింది. ● **గంట్యాడ:** మండలంలోని పెంటశ్రీరాంపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో కోరం లేక ఎస్ఎంసీ ఎన్నిక నిలిపివేశారు. మండలంలోని 59 పాఠశాలల్లో ఎన్నిక నిర్వహించగా 13 పాఠశాలల్లో పోటీ జరగగా, మిగిలిన 46 పాఠశాలల్లో ఏకగ్రీవం అయ్యాయి. ● **డెంకాడ:** మండలంలో 66 పాఠశాలలకుగాను 32 పాఠశాలల్లో ఎన్నికలు ఏకగ్రీవం అయ్యాయి. మిగతా పాఠశాలల్లో పోటీ జరగగా, గుణుపూరు పాఠశాలలో కోరం లేని కారణంగా ఎన్నిక వాయిదా పడింది. ● **గజపతినగరం:** స్కూలు మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు 53 పాఠశాలల్లో నిర్వహించారు. కెంగువ యూపీ పాఠశాల, రామన్నపేట ప్రాథమిక పాఠశాలలో కోరం చాలక పోవడంతో వాయిదా పడ్డాయి. మిగిలిన 53 చోట్ల ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. ● **మెంటాడ:** ఎస్ఎంసీ ఎన్నికల్లో కూటమి పార్టీలు సత్తా చాటాయి. మొత్తం 66 కమిటీలకుగాను 56 చోట్ల కూటమి మద్దతుదారులు ఎన్నికయ్యారు. వైసీపీ చేతులెత్తేసింది. కేవలం 10 స్థానాలకు పరిమితమైంది. పెదమేడపల్లి మోడల్ స్కూల్‌లో కోరం లేక ఎన్నిక వాయిదా పడింది.


పెదబంటుపల్లి పాఠశాల వద్ద వాగ్వాదం చేసుకుంటున్న విద్యార్థుల తల్లిదండ్రులు

ఘర్షణ వాతావరణం

గుర్ల: మండలంలోని 66 పాఠశాలల విద్యా కమిటీ ఎన్నికల్లో 61 చోట్ల పోటీ జరగగా, అందులో 43 చోట్ల ఏకగ్రీవమయ్యాయి. మిగతా ఐదు చోట్ల వాయిదా వేశారు. పాలవలస, పెదబంటుపల్లి ఉన్నత పాఠశాలల్లో ఇరు వర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకోవడంతో ఆ రెండు చోట్ల ఎన్నికలు వాయిదా పడ్డాయి. కలవరచర్ల ఉన్నత పాఠశాల, గూడెం, ఫకీర్‌కిట్టలి ప్రాథమిక పాఠశాలల్లో కోరం సరిపడక ఎన్నికలు వాయిదా పడ్డాయి.● పాలవలస, పెదబంటుల్లి జడ్పీ ఉన్నత పాఠశాలల్లో ఇరు పార్టీల నాయకులు తమ వర్గానికి చైర్మన్ ఇవ్వాలంటూ తల్లిదండ్రులను బెదిరిస్తూ గందరగోళం సృష్టించారు. తల్లిదండ్రులు గదుల్లోకి వెళ్లనీయకుండా అడ్డుకున్నారు. దీంతో ఇరు పార్టీల నాయకులు వాగ్వాదానికి దిగారు. దీంతో ఘర్షణ వాతావరణం నెలకొంది. అలాగే పెద బంటుపల్లి ఉన్నత పాఠశాలలో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. పోలీసులు కలుగజేసుకోవడంతో పరిస్థితి సద్దుమనిగింది.


బొబ్బిలి: గొల్లపల్లి హైస్కూలులో హెచ్ఎం, పెద్దల సంప్రదింపులు


ఎస్.కోట: ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎన్నికైన యాజమాన్య కమిటీని అభినందిస్తున్న ఉపాధ్యాయులు


వేపాడ: ఆదర్శ పాఠశాలలో మాట్లాడుతున్న డీఈవో ప్రేమ్‌కుమార్


రేగిడి: చిన్నశిర్లాంలో ఎన్నిక ప్రక్రియలో ఇరువర్గాల వాదన

జక్కువలో చోరీ

మెంటాడ: జక్కువ గ్రామంలో ఓ ఇంట్లోని మూడున్నర తులాల బంగారం చోరీకి గురైంది. మతల శ్రీరాం అనే వ్యక్తి ఇంట్లోని వారు పొలం పనులకు వెళ్లారు. కాసేపటి తర్వాత ఇంటి యజమాని బయటకు తాళం వేసి తాళం చెవిని ఇంటిబయట గోడపై పెట్టారు. గుర్తు తెలియని వ్యక్తులు తలుపు తీసి ఇంట్లో భద్రపరచిన మూడున్నర తులాల బంగారం ఎత్తుకుపోయారు. విషయం తెలుసుకున్న ఇంటి యజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఆంద్ర ఎస్ఐ బి.దేవి తెలిపారు. సంఘటనా స్థలాన్ని డాగ్ స్క్వాడ్, వేలి ముద్రల నిపుణులు సందర్శించారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

మెంటాడ: అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను గురువారం ఆంద్ర పోలీసులు పట్టుకున్నారు. పెదమేడపల్లి గెడ్డ, చంపావతి నది నుంచి ఇసుకను తరలిస్తున్నట్లు ఎస్ఐ దేవి తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం సీసాల స్వాధీనం

మెంటాడ: పెదచామలాపల్లిలో విద్యా కమిటీ ఎన్నికల సందర్భంగా పంపిణీకి వైసీపీ నేతలు 87 మద్యం సీసాలను సిద్ధం చేశారు. ఒకరి ఇంట్లో కొన్ని, పెరట్లో ఇంకొన్ని దాచిపెట్టారు. విషయం తెలుసుకున్న ఆంద్ర ఎస్ఐ దేవి సిబ్బందితో దాడిచేసి మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్వారీ పనులు ప్రారంభం

భోగాపురం: రామచంద్రపేట సమీపంలో ఎయిర్‌పోర్టు నిర్మాణ పనుల్లో భాగంగా జీఎంఆర్ సంస్థ ద్వారా ఎల్అండ్‌టీ నిర్వహించనున్న క్వారీ పనులు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. క్వారీ నిర్వాహణకు సంబంధించి అన్ని పనులు వేగవంతం చేస్తున్నారు.

నేడు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

కలెక్టరేట్: ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని జిల్లా గిరిజన సంక్షేమ అధికారి రామానందం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు జరిగే ఈ ఉత్సవానికి కలెక్టర్ అంబేడ్కర్ ముఖ్యఅతిథిగా హాజరవుతారని, అలాగే విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అదితి గజపతిరాజు తోపాటు ఇతర ప్రముఖులు హాజరవుతారని చెప్పారు.

గ్రామాల్లో అధికారుల 'సందర్శన'

భోగాపురం: గ్రామంలో ఎమైనా ప్రజా సమస్యలుంటే అధికారుల దృష్టికి తీసుకు రావాలని మండల ప్రత్యేక అధికారి సుధారాణి అన్నారు. గురువారం రావాడ గ్రామంలో గ్రామ సందర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈసంద ర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో సమస్యలుంటే దరఖాస్తు రూపంలో అందజేయాలన్నారు. అంతకుముందు అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. ఎంపీడీవో జి.చంద్రకళ, తహసీల్దార్ ఎం.సురేష్, సీడీపీవో ఎస్తేర్‌రాణి, కార్యదర్శి సురేష్ పాల్గొన్నారు. ● **గుర్ల:** పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని బీసీ కార్పొరేషన్ ఈడీ పిట్రంగి రావు అన్నారు. గురువారం పల్లిగండ్రేడు గ్రామంలో గ్రామ సందర్శన నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రం, పాఠశాలలను తనిఖీ చేసి మధ్యాహ్న భోజనాలను రుచి చూశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఆదిలక్ష్మి, ఎంపీడీవో వెంకటరావు, ఏవో తిరుపతిరావు, ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి ఆరుద్ర, సూపర్‌వైజర్లు శకుంతల, రాధిక, మండల అధికారులు పాల్గొన్నారు. ● **చీపురుపల్లి:** మండలంలోని పేరిపి గ్రామంలో గురువారం గ్రామ సందర్శన కార్యక్రమం నిర్వహించారు. మండల ప్రత్యేకాధికారి ఎం.రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో అధికారులు గ్రామాన్ని సందర్శించారు. ఈసందర్భంగా పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. అనంతరం ఆమె అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ కేఎస్ఎస్ఎన్ అన్నపూర్ణాదేవి, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు. ● **గజపతినగరం:** గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ బెల్లాన జ్ఞానదీపిక అన్నారు. గురువారం పాతశ్రీరంగరాజపురం లో మండల ప్రత్యేక అధికారి రమేష్ ఆధ్వర్యంలో గ్రామ సందర్శన కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ జయంతి ప్రసాద్, సర్పంచ్ గిరిజాల కామునాయుడు, ఏఓ సుదర్శనం తదితరులు పాల్గొన్నారు.

తరతమ బేధం లేని వ్యక్తి కెంబూరి

చీపురుపల్లి: రాజకీయల్లో తరతమ బేధం లేకుండా పేదలందరికీ సేవలందించిన వ్యక్తిగా కెంబూరి రామ్మోహనరావు నిలిచిపోతారని ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కెంబూరు మృతి పట్ల ఆయన సంతాపాన్ని వ్యక్తం చేశారు. ప్రజల మనిషిగా ఆయన గొప్ప మన్ననలు పొందారన్నారు. కెంబూరి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నానని ఆయన తన ప్రకటనలో తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మెంటాడ: విద్యుత్ పనులు పునరుద్ధరణలో భాగంగా శుక్రవారం ఉదయం 7:30 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ఆంద్ర ఫీడర్ పరిధిలో ఉన్న గ్రామాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని అధికారులు తెలిపారు. ● **దత్తిరాజేరు:** మండలంలో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ కోత విధిస్తున్నట్టు ఏఈ ఎల్.ఆదిత్య తెలిపారు.